# భాయీజాన్

నీ వుత్తరం అందింది. ఈ వూరు వచ్చి రెండు రోజులు నాతో కులాసాగా గడపాలనుందని వ్రాశావ్ –

నీకు యిక్కడి పరిస్థితులు తెలియక యిలా రాశావ్. నువ్విక్కడకు రావడం వృధా ప్రయాస. రావద్దు!

నాతో యీ వూళ్ళో రెండు రోజులు గడపడం కులాసాగా వుంటుందనుకుంటున్నావ్. కాని నీతో రెండు దినాలు గడపడానికి స్వేచ్ఛాజీవి ననుకుంటున్నావు. నేను యీ వూరు పొలిమేర అనుజ్ఞ లేకుండా దాటడం మహాపరాథాలలో ఒకటన్న సంగతి నీకింకా తెలీదల్లే వుంది.

ఈ వూళ్ళో రెండు రోజులు కులాసాగా గడుస్తాయి అనుకుంటున్నావు. ఇది యింకొక పొరపాటు. ఇక్కడకు వస్తే ఎక్కడ వుంటావో ముందు చెప్పు...? మూడు మూళ్ళ పొడవూ నాలుగు మూళ్ల వెడల్పూ వున్న నా గదిలో నా పెట్టె, బెడ్డింగ్, బుక్‌షెల్ఫ్, చిల్లర వస్తువులూ మూడు వంతులు ఆక్రమించగా, నేను కాక ఇంకా నువ్వూ, నీ సామానూ, యెక్కడ యిముడుతారని? అటువంటి గదిలో యెందుకున్నావ్ అంటావేమో? దీనికే వందన్నర పోటీలు యీ వూళ్ళో! యింక నీ భోజనం మాట?

ఈ రేషనింగ్ దినాల్లో పరిచయుల యింటికి వెళ్ళి భోజనం చేస్తాననడం నిజంగా క్రూరం. హోటల్లో తినలేవు. కమ్మటి ఆవు నెయ్యికి అలవాటుపడ్డ వాడవు మరిగి మరిగి ఆముదంగా మారిన నేతితో ఒక్క పిడచైనా నోట పెట్టగలవా? వారానికో క్రొత్తరకం బియ్యం రావడంచేత పదును తెలియక పలుకో, ముద్దో అయిన అన్నం ముట్టనైనా ముట్టగలవా? బీరపీచూ, బెండపళ్ళ కూరలతో అన్నం కలపగలవా? మార్పు వల్ల కొళాయి నీళ్ళు కడుపు నొప్పి పుట్టిస్తున్నాయని ప్రతివారి నోటా వింటూ గుక్కెడు నీరయినా మ్రింగగలవా? ఇంక విస్తరి దగ్గర కూర్చొని శ్రీనాధుడిలా–

యెన్నడు కడిగట్ట యెరుగనైతిని యని
కుడి హస్తమా నీవు జడియబోకు

– అంటూ అవయవాలకు ధైర్యం చెప్పుకోవాలి. మా మాటా? మే మెప్పుడో మానవాతీతులమై వూరుకున్నాం–

నాల్గు గంటల నిద్రతో తృప్తిపడగలం. కాళ్ళూ చేతులూ ముడుచుకొనే నిద్రపోగలం. పచ్చిబియ్యం, బీరపీచూ, ఆముదంతో తృప్తిగా భోం చేయగలం. కడుపు నొప్పినీ, డయేరియానీ ధైర్యంగా ఎదుర్కోగలం. లారీలు అరా పాతికా దేహాన్ని గీరుకుంటూ పోయినా త్వరలో గాయాల్ని మాన్పుకోగలం. రాక్షసి బొగ్గు పొగపీల్చి బ్రతకగలం.

నువ్వు మానవ మాత్రుడివి. హాయిగా పల్లెపట్టులలో బ్రతుక నేర్చిన వాడివి. యీ వాతావరణంలో రెండు రోజులైనా బ్రతకలేవు.

పోతే, నువ్వు నా సలహాను కాదని వచ్చావంటే నా గత జీవితంలోని మధుర దృశ్యాలనూ, ఆదర్శాలనూ, ఆశయాలనూ జ్ఞాపకం చేస్తావ్. వాటిని విడిచినందుకు అశక్తితో నేను బాధపడతాను. రెండు రోజులుండి పోతావ్. నీతోటి నా చిన్నతనపు రోజులు జ్ఞాపకం వస్తాయ్. వేదనతో హృదయం తపించి పోతుంది.

ఏదో సుడిగుండంలో పడికొట్టుకుపోతూన్న నన్నూ రెండు రోజులు స్వర్గంలో దింపి తర్వాత నన్ను నరకానికి త్రోయడమెందుకూ?

వృధాగా వచ్చి నువ్వు బాధపడి, నన్ను బాధపెట్టడం నాకు యిష్టం లేదు. నువ్విక్కడకు ఎంతమాత్రమూ రావద్దు... ★

*(ఆనందవాణి: 15, అక్టోబర్ 1944)*